## వైభవంగా ఆత్మలింగ శివాలయ ప్రాణ ప్రతిష్ఠ



శివాలయ ప్రాణ ప్రతిష్ఠకు హాజరైన మాధవానంద సరస్వతి స్వామి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 21: మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో ఉన్న రాజుల గుట్టపై నిర్మించిన ఆత్మలింగ శివాలయ ప్రాణ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో, భక్తిభావంతో మెలగాలన్నారు.

## పోటీతత్వం అలవర్చుకోవాలి

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 21: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. శుక్రవారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని, వ్యసనాలకు దూరంగా ఉంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు అలరించాయి. కార్యక్రమంలో లెక్చరర్లు హరిత, అనంత్‌రాజ్, ప్రభాకర్, రమేశ్, రాజు, శ్రీశైలం, మల్లేశం, జహీరాబేగం, కిష్టారెడ్డి, విజయభాస్కర్, శ్రీలత, అశ్విని తదితరలున్నారు.

## రెండో రోజు ఈ బాహా బగ్గీల పోటీలు



బగ్గీలను పరిశీలిస్తున్న క్రీడాకారులు

నర్సాపూర్, ఫిబ్రవరి 21: నర్సాపూర్‌లోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో ఈ బాహా కేటగిరీ కోసం ఎస్ఏఈ బాహా సే ఇండియా–2025 పోటీలు రెండో రోజు కొనసాగాయి. శుక్రవారం టెక్నికల్ విషయాలపై పరీక్షలు, సాంకేతిక తనిఖీలు, బ్రేక్ టెస్ట్, తుఫాను పరీక్షలు, డిజైన్ ఫైనల్స్, ఆవిష్కరణలు, ధ్రువీకరణ, ద్రోణాచార్య త్వరణం, డైనమిక్ సంఘటన నిర్వహించారు. ఈ పోటీల్లో 85 టీమ్స్ దరఖాస్తు చేసుకోగా, 77 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేశంలోని 19 రాష్ర్టాలకు చెందిన ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, యూనివర్సిటీల నుంచి 77 మంది విద్యార్థులతో డిజైన్ చేసిన బగ్గీల్లో ఈ బాహా ఎస్ఏఈ ఇండియా పాల్గొన్నారు.

## నేటి నుంచి ఉపాధి హామీ తనిఖీలు



మాట్లాడుతూ ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను ఈనెల 22 నుంచి తనిఖీ బృందాలు పరిశీలించనున్నట్లు ఎంపీడీవో దామోదర్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలకు వచ్చే సోషల్ ఆడిట్ బృందాలకు ఆ గ్రామ టీఏలు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో రాజ్‌కుమార్, వెంకట్ సాయి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ రవి, డీఆర్పీలు, వీఎస్ఏలు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21: త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్‌లోని 1వ వార్డు ఔరంగబాద్ కాలనీలో రూ.4 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఏఈ బాలసాయగౌడ్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుంటే కఠిన చర్యలు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 21: వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నర్సింహులు తెలిపారు. శుక్రవారం చండూర్ చౌరస్తా వద్ద ఎస్సై తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న రెండు బైక్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో ఏఎస్సై మిస్బోద్దీన్, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



నిజాంపేట, ఫిబ్రవరి 21: రాంపూర్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని టీచర్ల బృందం శుక్రవారం నిర్వహించింది. తెలుగు ఉపాధ్యాయుడు చంద్రకాంత్ ఆధ్వర్యంలో మాతృభాషా గొప్పదనంపై విద్యార్థులు రాసిన కవితలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అర్జున్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, సుకన్య, నరేశ్, కుమారస్వామి, షాదుల్ పాల్గొన్నారు.

## చిలిపిచెడ్ పాఠశాలలో స్వయంపరిపాలన



చిలిపిచెడ్, ఫిబ్రవరి 21: చిలిపిచెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించుకున్నారు. ఎంఈవో, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

## అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి



విద్యార్థితో హ్యాండ్‌రైటింగ్ రాయిస్తున్న ఎంఈవో


చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని ఎంఈవో పుష్పవేణి సూచించారు. శుక్రవారం గజగట్లపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

## 'సుగుణ' యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ విజయం

శివ్వంపేట, ఫిబ్రవరి 21: శభాష్‌పల్లి పంచాయతీలోని సుగుణ ఫుడ్స్ కంపెనీలో శుక్రవారం కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సీఐటీయూ అభ్యర్థి మల్లికార్జున్ విజయం సాధించారు. రెండోసారి యూనియన్ అధ్యక్షుడిగా గెలుపొందారు. జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి కుమార్, ఇంద్రేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతర్

- అధిక ధరలకు యూరియా విక్రయాలు
- ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు.. తెలిసే అమ్ముతున్నా అంటున్న యజమాని



ఫోన్‌పేలో అధిక వసూలు



ఇది బిల్లు

కౌడిపల్లి, ఫిబ్రవరి 21: జిల్లా అధికారుల ఆదేశాలు బేఖాతరు చేయడమే కాకుండా అధిక ధరలకు యూరియా విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్న ఘటన కౌడిపల్లిలోని భాగ్యలక్ష్మీ ఫర్టిలైజర్ దుకాణంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్నది. యూరియా బస్తా రూ.266 అమ్మాల్సి ఉండగా రూ.285కు విక్రయిస్తూ, బస్తాపై రూ.19 అధికంగా వసూలు చేస్తున్నారు. ఇదేమిటని రైతులు ప్రశ్నిస్తే యూరియా తమకె బస్తా రూ.310కి వస్తున్నదని, రైతుల సంక్షేమం కోసం రూ.15 తక్కువకు విక్రయిస్తున్నామని బుకాయిస్తున్నారు. ఏ అధికారి తమకు చెప్పాల్సిన అవసరం లేదని, ఎక్కువ ధరకు వస్తుంది, బరాబరా అమ్ముతానంటూ రైతులకు తెగేసి చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఇది వరకే నమస్తే తెలంగాణలో అధిక ధరలకు యూరియా అమ్మకాలని కథనాలు రావడంతో జిల్లా అధికారులు ఆ షాపులకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. కాని అవేమీ పట్టనట్లుగా ఇష్టారాజ్యంగా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

**నా జోలికొస్తే జాగ్రత్త అంటూ బెదిరింపు**

అధిక ధరలకు యూరియా అమ్ముతున్నట్లు తెలుసుకున్న విలేకరి, ఫర్టిలైజర్ షాపు యజమానికి ఫోన్ ద్వారా వివరణ కోరగా మీరు ఇష్టం వచ్చినట్లు రాస్తే బాగుండదు. నా కొడుకులతో జాగ్రత్తగా ఉండాల్సి వస్తది.. చూసుకో మరి అంటు బెదిరింపులకు దిగాడు. ఏ అధికారి చెప్పినా నాకు నచ్చిన ధరకే ఎరువులు అమ్ముతా.. నీ ఇష్టం ఉన్నట్లు చేసుకో, ఎరువులు అమ్మకపోతే నాకు ఒరిగేదేమీ లేదు, షాపు బంద్ చేసుకుంటాం అంటూ ఇష్టారీతిలో మాట్లాడాడు. ఈ విషయంలో వ్యవసాయశాఖ ఏవో స్వప్న జాదవ్‌ను వివరణ కోరగా చర్యలు తీసుకుంటాం, కాని ఈ టైంలో షాపు యజమానులను టైట్ చేస్తే రైతులకు యూరియా అమ్మకుండా ఇబ్బందులకు గురిచేస్తారని, అందుకె చూసీచూడనట్లు వదిలేస్తున్నామని తెలిపారు.

**ఎవరైనా ఎమ్మార్పీకే విక్రయించాలి**

ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎమ్మార్పీ కంటె ఎక్కువ ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తే ఊరుకోం. అలా అమ్మితే షాపు లైసెన్స్‌లు రద్దుచేస్తాం. - వినయ్, జిల్లా వ్యవసాయ అధికారి

## మందులు నిల్వలు ఉంచుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- డ్రగ్ స్టోర్, జిల్లా కేంద్ర దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్



డ్రగ్ స్టోర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ స్టోర్ ద్వారా జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో మందులు సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డ్రగ్స్ స్టోర్, మెదక్ ఏరియా దవాఖానను కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా డ్రగ్స్ స్టోర్‌ను పరిశీలించి, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మెదక్ ఏరియా దవాఖానలో వ్యాధి నిరోధక టీకాల నిల్వ చేయు గదిని పరిశీలించారు. అనంతరం ఫిజియోథెరపీ సెంటర్ సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ కార్యాలయాన్ని పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. డెంటల్ విభాగాన్ని పరిశీలించి సమర్థ నిర్వహణకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవలు ప్రణాళికాబద్ధంగా విస్తృత పరచాలన్నారు. అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు నిల్వ ఉంచుకోవాలని, జిల్లా డ్రగ్స్ స్టోర్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాలకు మందులు సరఫరా జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో వంద శాతం ఇమ్యునైజేషన్ సేవాలందించాలన్నారు. డెలివరీలను మెరుగుపర్చాలని, సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాల శాతం పెంచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌వో శివదయాల్, డాక్టర్ శివరాం, యునైజేషన్ అధికారిని మాధురి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధను పకడ్బందీగా అమలు చేయాలి

**కలెక్టర్లను ఆదేశించిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా**

మెదక్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆరు జిల్లాల్లో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్లను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్‌లో ఆదేశించారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, డీఈవో రాధాకిషన్ ఈ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఎంపికైన మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నారాయణపేట, మేడ్చల్, భూపాలపల్లి జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ఆరు పాఠశాలను ఎంపిక చేసి అమలుచేయాలన్నారు. ప్రాథమిక స్థాయిలో అభ్యసన సామర్థ్యాల పెంపునకు పిల్లలు చదవడం, రాయడం, సంబంధించి కృత్రిమ మేధా కార్యక్రమంలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసి, కుత్రిమ మేధా సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచి, విద్యార్థులు చదవడం, రాయడం సామర్థ్యాలు పెంపొందించేందుకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలు చేసే విధా నం, కావాల్సిన వసతులు సమీకరించుకుని జిల్లాలోని తూప్రాన్, కాళ్లకల్, నర్సాపూర్ నెంబర్2, బూరుగుపల్లి, నిజాంపేట్, మాసాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకుని మానిటరింగ్ చేస్తామన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రామాయంపేట: మక్కరాజుపేట పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి హైమావతి

రామాయంపేట/చేగుంట, 21: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని చేగుంట మండల ప్రత్యేకాధికారి హైమావతి పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట మండలం మక్కరాజపేట ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, స్నాక్స్ అందజేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీవో శ్వేత, కార్యదర్శి మాధవి, ఇన్‌చార్జి హెచ్ఎం ఉమారాణి ఉన్నారు.

**బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు**

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21: బాల్యవివాహాలు జరిపితే తమకు సమాచారం ఇవ్వాలని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి హైమావతి తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని జడ్పీహెచ్ఎస్‌లో బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే 1098కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిక టీం జిల్లా కోఆర్డినేటర్ సంతోషి, జెండర్ స్పెషలిస్ట్ నాగమణి, కవిత, రమేశ్ పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పూర్తి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

**బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం**



రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్‌టీయూ నాయకులు

శివ్వంపేట, ఫిబ్రవరి 21: మొదటి విడత రోడ్డు పనులు పూర్తి కావడంపై కేసీఆర్, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిలకు బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీటీ రోడ్డు శిథిలావస్థకు చేరి, గుంతలమయం కావడంతో కొన్నేండ్లుగా ప్రయాణికులు అవస్థలు ఎదురుకొన్నారన్నారు. మొదటివిడత రోడ్డు పూర్తి కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నిధులు మంజూరు చేయడంతో మండలంలోని ఉసిరికపల్లి, భీమ్లతండా, శంకర్‌తండా, పాంబండ, పోతులబొగుడ గ్రామాల ప్రజలకు అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అప్పటి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి ఈ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులపై ఒత్తిడి పెంచి రోడ్డు పనులు వేగంగా అయ్యేలా కృషి చేసినందుకు ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. థౌర్య తండా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.కోటి 54 లక్షలు మంజూరు కాగా, పనులు జరుగుతున్నాయన్నారు. చండి నుంచి గోమారం మీదుగా అనంతారం చౌరస్తా వరకు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. ఆయనతో ఉసిరికపల్లి మాజీ సర్పంచ్ మర్రి గోపాల్‌రెడ్డి, మాజీ వార్డుసభ్యులు పోతరాజు లింగం ఉన్నారు.

## అదుపు తప్పి టాటా పికప్ ట్రక్ బోల్తా



బోల్తా పడిన ట్రక్, పక్కనే కూలీ అమ్రేశ్ మృతదేహం

నిజాంపేట, ఫిబ్రవరి 21: టాటా పికప్ ట్రక్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన నిజాంపేట శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 765 డీజీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సూచిక బోర్డుల లోడ్‌తో ఉన్న టాటా పికప్ ట్రక్‌లో బీహార్, కర్ణాటక రాష్ర్టాలకు చెందిన తొమ్మిది మంది కూలీలు సిద్దిపేట నుంచి రామాయంపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో నిజాంపేట శివారులోని ఇరుకుగా ఉన్న శీరిక వాగు వంతెన వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ట్రక్ అదుపు తప్పి రోడ్డు కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో రాయ్‌చూర్, కర్ణాటక రాష్ర్టానికి చెందిన కూలీ అమ్రేశ్(28) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నిజాంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం మిగితా ఎనిమిది మంది క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంపై విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై జైపాల్‌రెడ్డి తెలిపారు.

## వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రామాయంపేట: వరి పంటను పరిశీలిస్తున్న డివిజన్ ఇన్‌చార్జి రాజ్ నారాయణ

రామాయంపేట, ఫిబ్రవరి 21: పంట కోత సమయంలో హార్వెస్టర్ యజమానులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని ఏవో రాజ్‌నారాయణ, తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట రైతువేదికలో రామాయంపేట, రాయిలాపూర్, అక్కన్నపేట రైతులు, హార్వెస్టర్ యజమానులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, హార్వెస్టర్ యజమానులు, ఆర్ఐ.గౌస్, ఏఈవోలు సాయికృష్ణ, ప్రవీణ్ ఉన్నారు.

**విత్తన నాణ్యతపై రైతులకు అవగాహన**

వెల్దుర్తి, ఫిబ్రవరి 21: పంట సాగు సమయంలో నాణ్యమైన విత్తనాలు తీసుకోవడం, సాగులో మెళకువలు పాటించాలని కౌడిపల్లి డివిజన్ ఏడీఏ పుణ్యవతి తెలిపారు. మాసాయిపేట రైతు వేదికలో విత్తన నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ విత్తనాలు నాణ్యతగా ఉంటేనే పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. అవసరమైన మేర ఎరువులు చల్లుకోవాలని, అధికంగా వేయడంతో భూసారం దెబ్బతింటుందన్నారు. కోత మిషన్ ఆర్పీఎం 1800 నుంచి 2100 ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం వెల్దుర్తిలో సొసైటీతో పాటు పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. సమావేశంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఏవో రామ్‌శివ, ఏఈవో రజిత పాల్గొన్నారు.

**ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలి**

నిజాంపేట, ఫిబ్రవరి 21: ధాన్యం ఆరబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ఏవో సోమలింగారెడ్డి సూచించారు. నిజాంపేట రైతువేదికలో యాసంగి వరి కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీలత, రమ్య, రైతులు కంది రాజారాం, టంకరి లక్ష్మణ్, భాస్కర్ నాయక్, శ్రీకాంత్ ఉన్నారు.

**ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

రేగోడ్, ఫిబ్రవరి 21: ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా కోఆపరేటివ్ అధికారి కరుణాకర్ వివరించారు. శుక్రవారం రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో వరి కొనుగోలుపై రేగోడ్, కొండాపూర్ గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం శుభ్రపరిచి, 17 శాతం తేమ ఉన్న ధాన్యం తీసుకొని రావాలని తెలిపారు.ఏవో జావీద్,ఏఈవో పాల్గొన్నారు.

**కోత సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి**

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21: వరి కోతల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ విజయనిర్మల సూచించారు. వరి కోత యంత్రాల యజమానులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో లక్ష్మీప్రవీణ్, ఏఈవోలు ఉన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి**

మనోహరాబాద్, ఫిబ్రవరి 21 ః రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి సురేశ్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్‌లోని రైతు వేదికలో ఏవో స్రవంతి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు, ఏఈవోలు సచిన్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో సహకార సంఘం ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీఏ పుణ్యవతి



చిన్నశంకరంపేట: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ విజయనిర్మల

## ప్రాణాలైనా ఇస్తాం.. సెల్ టవర్ వేయనివ్వం



ఆందోళన చేస్తున్న ప్రజలు

మెదక్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రాణాలైనా ఇస్తాం.. సెల్ టవర్ వేయనివ్వమని స్థానికులు తేల్చిచెప్పారు. ఎయిర్‌టెల్ సంస్థ నిర్వాహకులు మెదక్‌లోని నర్స్ ఖేడ్ కాలనీలో ఇండ్ల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్‌ను స్థానికులు అడ్డుకున్నారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింలు మాట్లాడుతూ సెల్ టవర్ విషయంలో కొంత కాలంగా ఆందోళన చేస్తున్నామని, అధికారులను కలిసి సెల్ టవర్ నిర్మించొద్దని విజ్ఞప్తి చేశామన్నా రు. టవర్ రెడియేషన్‌తో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ స్పందించిన టవర్ పనులు నిలిపేయాలని మున్సిపల్ అధికారులను ఆ దేశించారు. చింతల రమేశ్, వనం యేస య్య, కండేలా రాములు, గంగాధర్, గోప య్య, పాపయ్య, పోచయ్య, నాగరాజు, నవీన్, దాసు, సూరి, యేసు, మహిళలు పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, ఫిబ్రవరి 21: వెల్దుర్తి కేజీబీవీ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్టుకు గెస్టు లెక్చరర్ కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఎస్‌వో ఫాతిమా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పీజీలో ఫిజిక్స్ పట్టభద్రులై ఏడాది అనుభవం కలిగిన వారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో పేర్కొన్నారు. దరఖాస్తులను కస్తూర్బా పాఠశాల వెల్దుర్తిలో అందజేయాలని, చివరి తేదీ ఈ నెల 25 అని తెలిపారు.

## మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

నర్సాపూర్, ఫిబ్రవరి 21: జక్కపల్లి మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఫర్హానా పేర్కొన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి, 7 నుంచి 10వ తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షా తేదీ ఏప్రిల్ 13న ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్‌లకు పరీక్షా ఫీజు రూ.125, ఓసీలకు రూ.200 అన్నారు.

## ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదు



మణెమ్మకు జ్ఞాపిక అందజేస్తున్న వైద్యులు

రామాయంపేట, ఫిబ్రవరి 21: ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని, ఉద్యోగ ధర్మంలో చేసిన పనులు జీవిత కాలం గుర్తుండి పోతాయని రామాయంపేట సీహెచ్‌సీ వైద్యులు లింబాద్రి, సుకేషిని పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ దవాఖానలో స్వీపర్‌గా పని చేసిన మణెమ్మను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జయలక్ష్మి, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

## పైలట్ కుటుంబానికి ఆర్థిక సాయం



రామాయంపేట, ఫిబ్రవరి 21: మండలంలోని రాయిలాపూర్‌కు చెందిన గజం చంద్రం ఇటీవల మృతి చెందాడు. ఈ ఉద్యోగి కుటుంబానికి రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రూ.20,200 నగదును శ్రీనివాస్‌గౌడ్, జాకబ్, ప్రాన్సిస్, స్వామి, రమేశ్, దుర్గాప్రసాద్, నర్సింహ్మ, ఆసీఫ్ అందజేశారు.

## ఎస్టీయూ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పర్వతరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21: ఎస్టీయూ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు రఘోత్తంరెడ్డి, నరేందర్‌రెడ్డిలను గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి కోరారు. శుక్రవారం మెదక్‌లోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ అధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రఘోత్తంరెడ్డి 30 ఏండ్ల పాటు ఉపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా విధులు నిర్వహించారని, ఎమెల్సీగా ఆరేండ్లు పనిచేశారన్నారు. సమావేశంలో నాయకులు పోచయ్య, భూపతిగౌడ్, అశోక్, శ్రీనివాస్, అరుణ్, దిలీప్, రత్నాకర్, రతన్, నరేష్, జబ్బార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



జాతీయ రహదారి వద్ద తుఫాన్ వాహనం

రామాయంపేట, ఫిబ్రవరి 21: రామాయంపేట జాతీయ రహదారిలోని వై జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ తుఫాన్ వాహనం హైదరాబాద్ నుంచి రామాయంపేట వై జంక్షన్ వద్ద పట్టణం లోపలకు వస్తున్న కారు రెండు ఢీకొన్నాయి. దీంతో డివైడర్ మొత్తం ధ్వంసమైంది. రెండు కార్లలో ఉన్న వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలి



యాదగిరి

నర్సాపూర్, ఫిబ్రవరి 21: చేవెళ్లలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమ లు చేయాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమి తి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి హోళియ దాసరి డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీలకు 15 శాతం నుంచి 22 శాతం రిజర్వేషన్ పెంచాలని, 59 దళితుల సమగ్ర అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చించాలని కోరారు. హోళియ దాసరి ఎస్సీ కులాన్ని గ్రూప్ ఏలో చేర్చాలన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని నలుగురికి గాయాలు

రామాయంపేట, ఫిబ్రవరి 21: ద్విచక్ర వాహనం ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట రైల్వే స్టేషన్ నుంచి ఓ వ్యక్తి బైక్‌పై తన భార్యను తీసుకుని వస్తున్నాడు. అదుపు తప్పిన బైకు నడుచుకుంటూ వెళ్తున్న మరో భార్యాభర్తలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సులో నలుగురు వ్యక్తులను రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ ఇస్మాయిల్‌ఖాన్‌పేట కంది దగ్గర హెచ్ఎండి, రేరా అప్రూవల్ ఓపెన్ ప్లాట్స్ మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. మంచి ఇన్సెంటివ్స్ కలవు. Ph: 7095335588.
NT-329045

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.